క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలపై అవగాహన

మహారాణిపేట: ఎన్నికల నిబంధనలు, కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అవగాహన కల్పించారు. రామ్మూర్తి పంతులు పేట, శివ నగర్, బాపూజీనగర్, స్వర్ణభారతి, ఏఎస్ఆర్ నగర్, అంబేడ్కర్‌నగర్ కాలనీ, ఏకేసీ కాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ఎలక్షన్ మోడల్ కోడ్, రాజకీయ నాయకుల ఫొటోలు గల బ్యానర్స్, గోడపత్రికలను తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీల్లో రికార్డ్సను, రిపోర్ట్సను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు



వృద్ధులకు పండ్లు, దుప్పట్లు అందజేస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్: వైఎస్సార్ సీపీ 29వ వార్డు నాయకుడు, ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త యలమంచిలి సంతోష్ మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ సమీపాన ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులకు పండ్లు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పీతల వాసు, కోరాడ సురేష్, అడపా శివ, తమ్మినేని శ్రీనివాస్, బొండా వెంకట్రావు, కనకల రాజు, నడుపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

23న సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 23న సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నామని ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. రూ.1,500 రుసుం చెల్లించిన దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని చెప్పారు.

స్పందన కార్యక్రమం కొనసాగించాలి

మహారాణిపేట: ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరుతూ విశాఖ దళిత సంఘాల ఐక్య వేదిక(విదసం) మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. ఐక్య వేదిక ఏపీ స్టేట్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వల్ల స్పందన కార్యక్రమం నిలిచిపోవడంతో మూడు నెలల పాటు ప్రజా సమస్యలను అధికారులు పట్టించుకునే అవకాశం లేదన్నారు. ఈ నేపథ్యంలో స్పందనను కొనసాగించాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. సచివాలయం, తహసీల్దార్ కార్యాలయం ద్వారా విద్యార్థులకు ఇచ్చే కుల, జనన, ఇతర సర్టిఫికెట్లను జారీ చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రాన్ని పంపి స్పందన కార్యక్రమం నిర్వహణకు అనుమతి తీసుకోవాలని వెంకటరావు కోరారు. విదసం నాయకులు సోడదాసు సుధాకర్, ఎస్.ఆర్.వేమన, బల్ల కుమార్, ఓంకార్, బొడపాటి శ్యామూల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపు మనదే... మెజారిటీ పెంచాలి



మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ 35వ వార్డు నాయకులు

- 24న ఎన్నికల ప్రచారం ప్రారంభం
- సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయపతాకం ఎగరవేయడం ఖాయమైనప్పటికీ ఓటింగ్ శాతం పెంచి మెజార్టీ పెంచేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. తనతోపాటు విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం జగనన్నకు బహుమతిగా అందజేయాలని కోరారు. ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లో గల వాసుపల్లి కార్యాలయంలో మంగళవారం జీవీఎంసీ 33, 34, 35, 36, 39 వార్డుల కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, బూత్ ప్రెసిడెంట్లు, పార్టీ సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ప్రతీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి నేరుగా ఓటర్లను కలుసుకోవాలని సూచించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో అనేక మందికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన కార్యక్రమాలు వివరించాలన్నారు. సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రతిపక్షాల కుట్రలు తిప్పికొట్టాలన్నారు. చంద్రబాబును, పవన్ కల్యాణ్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఎంత మంది కలిసొచ్చినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒంటరిగానే విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మంచి మెజార్టీ తీసుకురావాలని కోరారు. మరీ ముఖ్యంగా శత శాతం డోర్ టు డోర్ ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 24న ప్రారంభించనున్న ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని కూడా నియోజకవర్గ ప్రజల దృష్టికి తీసుకెళ్లడమే గాక స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొనేటట్టు చూడాలన్నారు. కార్యక్రమంలో వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. విజయం మనదేనంటూ నినదించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎన్నికల కోసం సిద్ధంగా ఉందంటూ వాసుపల్లికి జై కొట్టారు.



సమావేశంలో వాసుపల్లి గణేష్‌కుమార్

'దక్షిణ' జనసేనలో ఆగ్రహజ్వాలలు



వంశీకృష్ణ శ్రీనివాస్ వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జనసైనికులు.., నల్లబెలూన్లు ఎగురవేస్తున్న వీరమహిళలు

- వంశీకృష్ణ అభ్యర్థిత్వంపై సెగలు కక్కుతున్న జనసైనికులు
- చిత్రపటం దహనం చేస్తూ.. నల్లబెలూన్లు ఎగరేసి నిరసన

దాబాగార్డెన్స్ : విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేనలో అగ్గి రాజుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిని అంటున్న వంశీకృష్ణ శ్రీనివాస్‌పై జనసైనికులు మండిపడుతున్నారు. ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్న చందంగా ఉందంటూ జనసైనికులు ఎద్దేవా చేస్తున్నారు. పొత్తులో భాగంగా విశాఖ దక్షిణ నియోజకవర్గ టికెట్ జనసేన పార్టీకి కేటాయించినప్పటికీ.. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇప్పటి వరకు అభ్యర్థి పేరు ప్రకటించలేదు. అయినప్పటికీ తానే అభ్యర్థినంటూ వంశీకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండడంతో ఇదే దక్షిణ నియోజకవర్గం టికెట్ ఆశిస్తున్న 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్, జనసేన మత్స్యకార నాయకుడు డాక్టర్ మూగి శ్రీనివాసరావు ఎట్టిపరిస్థితుల్లోనూ సహకరించమని బాహాటంగానే తేల్చిచెప్పారు.

వంశీకృష్ణ చిత్రపటం దహనం

పలువురు జనసైనికులు మంగళవారం నియోజకవర్గ పరిధిలో వంశీకృష్ణ శ్రీనివాస్ చిత్రపటాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. జనసైనికులు సూరాడ తాతారావు, బంగార్రాజు, జగన్నాథరావు, తాతాజీ, ఎండీ అబీదాతోపాటు పలువురు వీరమహిళలు వంశీకృష్ణపై మండిపడ్డారు. వంశీకృష్ణకు టికెట్ ఇవ్వొద్దంటూ నినాదాలు చేశారు. పవన్ కల్యాణ్ ముద్దు.. వంశీకృష్ణ వద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. నల్లబెలూన్లు ఎగరవేసి నిరసన చేపట్టారు. పక్క నియోజకవర్గంలో చిత్తుగా ఓడిపోయిన వ్యక్తిని ఇక్కడకు తీసుకొచ్చి మాపై రుద్దుతారా అంటూ విరుచుకుపడ్డారు. స్థానికంగా ఉన్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్‌కు గానీ, ఎప్పటి నుంచో జనసేన పార్టీకి సేవలందిస్తున్న డాక్టర్ మూగి శ్రీనివాసరావుకు గానీ టికెట్ ఇస్తే గెలిపించుకుంటామన్నారు. ఈ విషయంలో అధిష్టానం పునరాలోచన చేసి ఓడిపోయిన వ్యక్తికి కాకుండా గెలిచే వ్యక్తికే టికెట్ కేటాయించాలని కోరారు.



జనసైనికులు ఆగ్రహంతో దహనం చేస్తున్న వంశీకృష్ణ చిత్రపటాలు

శోభన్‌బాబు చిత్ర గీతాల విభావరి రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కంచర్ల అచ్యుతరావు తదితరులు

దాబాగార్డెన్స్: ఈ నెల 21న నటభూషణ్ శోభన్ బాబు వర్ధంతిని పురస్కరించుకుని శోభన్‌బాబు చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం సినీ నిర్మాత, ఉపకార్ సేవా ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు చేతుల మీదుగా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ కుటుంబ కథా చిత్రాల కథానాయకుడు శోభన్‌బాబు స్మారకార్థం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో ప్రముఖ గాయకులు ప్రజాదరణ పొందిన గీతాలు ఆలపించనున్నారని చెప్పారు. శోభన్‌బాబు వీరాభిమాని కోడూరు కనకరాజుకు శోభన్‌బాబు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఇందిరా సాహిణి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు వినతి



డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న ఆరోగ్యమిత్రలు, సిబ్బంది

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని పలువురు కోరారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావును మంగళవారం కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కనీస వేతనాలు ఉద్యోగ సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, ఇతర నాయకులు, ఆరోగ్యమిత్రలు, టీమ్ లీడర్స్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఉక్కు' రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షల్లో 1132వ రోజు, మంగళవారం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఈఎస్ అండ్ ఎఫ్, ఈఆర్ఎస్, ఈఎండీ, సేఫ్టీ, టెక్‌సెల్, ఆగ్రో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ విభాగాల కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరారు.

పారిశుధ్య నిర్వహణకు సహకరించండి

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కమిషనర్ పి.వి.వి.టి.ప్రసాదరావు మంగళవారం జగదాంబ జంక్షన్ మెయిన్ రోడ్డు, 35వ వార్డులోని పూర్ణా మార్కెట్, రామకృష్ణ జీవీఎంసీ కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. జగదాంబ ఏరియాలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికలను కార్మికుల చేత ఆయన తీయించారు. పూర్ణా మార్కెట్, రామకృష్ణా బజార్లలో గల వ్యాపారులంతా చెత్తను దాన్ని సేకరించే వాహనాలకు అందజేయాలని ఆదేశించారు. వ్యాపారులు పారిశుధ్య నిర్వహణకు సహకరించకుంటే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల వద్ద చెత్త డబ్బాలు లేకపోవడంపై జెడ్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి దుకాణం వద్ద చెత్త డబ్బా ఏర్పాటు చేయాలని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. షాపుల వద్ద చెత్త పేరుకుపోతే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం రహదారులను జెడ్సీ పరిశీలించారు. 35వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పేరుకుపోయిన చెత్త పరిశీలిస్తున్న జోన్-4 కమిషనర్ ప్రసాదరావు

అండగా 'అమ్మ ఒడి'

- పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక ప్రోత్సాహం
- ఏటా తల్లుల ఖాతాలో నగదు జమా

దక్షిణ నియోజకవర్గంలో నాలుగేళ్లుగా అందించిన 'అమ్మ ఒడి' లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు
2019-2020	18,430	రూ.27.64 కోట్లు
2020-2021	18,742	రూ.28.11 కోట్లు
2021-2022	19,100	రూ.28.65 కోట్లు
2022-2023	19,360	రూ.29.04 కోట్లు



జగదాంబ: చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే మంచి ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. పిల్లలను ఉన్నతంగా చదివించాలనే ఆసక్తి ఉన్నా.. ఆర్థిక స్థోమత సరిపోక వెనుకంజ వేసిన వేలాది మంది తల్లిదండ్రులకు అండగా ఈ పథకం నిలుస్తోంది. చదువుకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తూ చిన్నారుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోంది. నవరత్నాల్లో భాగంగా ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకంపై ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15 వేల చొప్పున వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమవుతోంది. ప్రభుత్వం అందజేస్తున్న ఈ సాయం ద్వారా ఇంటికి వెలుగులుతోపాటు చదువులు ముందుకు సాగుతున్నాయి.

లబ్ధిదారుల హర్షం

బడి ఈడు పిల్లలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువులకు దూరం కాకూడదనే సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని ద్వారా దక్షిణ నియోజకవర్గంలో అనేక మంది విద్యార్థులు లబ్ధి పొందారు. పిల్లలను బడికి పంపించే ప్రతి తల్లి బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నగదు జమ చేస్తోంది. నాలుగేళ్లుగా ఈ పథకం నిరిరామంగా కొనసాగుతోంది. పేద పిల్లల చదువుకు అమ్మ ఒడితో అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న మేలు మరిచిపోలేం



నాకు ఇద్దరు పిల్లలు. వారిని బడికి పంపించి చదివిస్తున్నా ను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అర్హత గల అన్ని పథకాలు వర్తిస్తున్నాయి. వాటితోపాటు పిల్లలకు అమ్మ ఒడి లబ్ధి అందుతోంది. జగనన్న చేసిన మేలు మరువలేనిది.

– నాయిని వరలక్ష్మి, పండా వీధి, 35వ వార్డు

అమ్మ ఒడి పథకంతో భరోసా



అమ్మ ఒడి పథకంలో పిల్లల చదువులకు భరోసా కల్పించారు. మా అబ్బాయికి ఏటా జగనన్న అమ్మ ఒడి ఆర్థిక ప్రోత్సాహం వస్తోంది. నాలుగేళ్లుగా లబ్ధి పొందుతున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– లావణ్య, ప్రసాద్ గార్డెన్స్, 35వ వార్డు

పాప చదువుకు సాయం



నేను పూర్ణా మార్కెట్‌లో పనిచేస్తున్నాను. వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. మా పాప చదువుకు ఇబ్బంది పడేవాళ్లం. జగనన్న అమ్మ ఒడి పథకం అందిస్తూ సాయంగా నిలిచారు. మాలాంటి పేదలు ఎందరినో ఆదుకుంటున్నారు.

– కాశీవిశ్వనాథ్, వెలంపేట

వయసులో చిన్న.. సేవలో పెద్ద

- 14 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించిన 16 ఏళ్ల బాలుడు

దాబాగార్డెన్స్: సేవ చేయాలన్న సంకల్పం ఉంటే వయసుతో సంబంధం లేదు. పిన్న వయసులోనే సమాజంపై గౌరవంతో.. సేవాభావంతో ఓ పదహారేళ్ల బాలుడు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. కెనడాలో ప్రారంభమైన బ్రైట్ ఫ్యూచర్స్ జేబీ ఫౌండేషన్ ద్వారా రోహన్ చెర్ల 14 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేసి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాడు. వివరాల్లోకి వెళ్తే.. డాక్టర్ కిరణ్ చెర్ల, సాయి చెర్ల కుమారుడైన రోహన్ చెర్ల నగరంలోని ఏవీఎన్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న 14 మంది పేద విద్యార్థులకు రూ.50 వేల స్కాలర్‌షిప్స్ అందజేశాడు. ఈ సందర్భంగా రోహన్ చెర్ల మాట్లాడుతూ ఏవీఎన్ కళాశాలలో 1930లో తన ముత్తాత వారణాసి సూర్యనారాయణమూర్తి ఇంగ్లిష్ లెక్చరర్‌గా సేవలందించారని, ఆయన జ్ఞాపకార్థం స్కాలర్‌షిప్స్ అందించినట్టు తెలిపాడు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి, ఇంగ్లిష్ విభాగాధిపతి పైడి రజని, కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్స్ అందుకున్న ఏవీఎన్ కళాశాల విద్యార్థులతో రోహన్ చెర్ల

కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లకు శిక్షణ

మహారాణిపేట: మంచి జీవనశైలితోనే ఆరోగ్యం పదిలమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా స్థాయి కేర్ కంపానియన్ కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. జీవన శైలి సరిగా లేకపోవడం వల్ల వచ్చే వ్యాధులను నివారించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన బ్రోచర్, వాల్‌పోస్టర్, బ్యాగ్‌లను ఆవిష్కరించారు. నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి, వైద్యులు బాలాజీ, శ్రీనివాస్, రవిశంకర్, కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ సాంబమూర్తి పాల్గొన్నారు.



కరపత్రాలు,బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

అబ్బురపరిచిన విన్యాసాలు

సీతంపేట: ప్రపంచ పౌర రక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం శాంతిపురంలోని పౌర రక్షణ సంస్థ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న 228 బ్యాచ్ వలంటీర్ల పాసింగ్ అవుట్ పెరేడ్ నిర్వహించారు. ముఖ్య అతిథులు రీజనల్ ఫైర్ ఆఫీసర్ వై.హనుమంతరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎస్.రేణుకయ్య శిక్షణ పొందిన 50 మంది వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు ప్రదర్శించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. అగ్నికీలలను అదుపు చేయడం, మంటలను ఆర్పివేయడం, బహుళ అంతస్తుల నుంచి పౌరులు, క్షతగాత్రులను తాళ్ల సాయంతో కిందకు దించడం వంటి సాహస విన్యాసాలను ప్రదర్శించారు. ఉప పౌరరక్షణ అధికారి కె.పద్మలత మాట్లాడుతూ శిక్షణ పొందిన వలంటీర్లు అత్యసర పరిస్థితుల్లో సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.రామారావు, అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది, పోలీస్, కమ్యూనికేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



మంటలు ఆర్పుతున్న వలంటీర్

నేటి నుంచి కల్యాణోత్సవం

దాబాగార్డెన్స్ : పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 20 నుంచి 26 వరకు నగరేశ్వరస్వామి, జనార్దన స్వామి దేవేరుల కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్టు దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొనాలని కోరారు.

23న మెన్ డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: మెన్ డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 23,24వ తేదీల్లో ఏవీఎన్ కళాశాలలో జరగనున్నాయి. తొలి నాలుగు స్థానా ల్లో నిలిచిన జట్లకు నగదు ప్రోత్సాహకాలను అందించనున్నారు. నాకవుట్ పద్ధతిలో 30 పాయింట్లతో మ్యాచ్ నిర్వహించనుండగా... క్వార్టర్ ఫైనల్స్‌నుంచి బెస్ట్ ఆఫ్ త్రీగా పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ విభాగాల్లో భద్రతా ర్యాలీ



ఈఎస్ఎఫ్ విభాగంలో భద్రతా ర్యాలీలో అధికారులు, కార్మికులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ విభాగాల్లో భద్రతా ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 28న స్టీల్ సేఫ్టీ డే సందర్భంగా ఉక్కు భద్రతా విభాగం ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ (ఈఎస్ఎఫ్), ఎల్ఎంఎం విభాగాల్లో ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇంజినీరింగ్ షాప్స్‌లో జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి ఎస్.కె. పాండే, భద్రతా విభాగం డీజీఎం ఎం.వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కార్మికులను కలిసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఎస్ఎఫ్ అధికారులు జి.సి.బోస్, బి.ఆర్.జెనా, ఎస్.డి.నాయక్, భద్రతా అధికారి పి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.